# నాటక ప్రదర్శనం
# సర్కసు వినోదము

మేము చేసుకున్న పూర్వ జన్మ సుకృతమేమో కానీ, మేము ఐదుగురమూ చిన్నప్పటి నుంచీ ఒకే సెక్షనులో పడుతున్నాం. రెండో ఫారం రెండో సంవత్సరంలోకూడ ఒకే సెక్షన్‌లో పడ్డాం. ఆ సంవత్సరం జయరామ ప్రభుగారు మా క్లాస్‌టీచరు. క్రిందటేడు మంచి మాష్టరి సెక్షన్‌లో పడ్డాం. ఆయన మంచి మాష్టరని యితరులు చెపితే తెలియాల్సిందే కాని ఆయన మంచి మాకేమీ వుపయోగపడలేదు. అంత మంచి మాష్టర్ వున్నప్పుడే మేము ప్యాసు కాలేదు. అందుకని మా యిప్పటి మాష్టరు ఒకమాదిరిగా చెప్తాడన్నాకూడా, మేము సెక్షన్ మార్చ తలచుకోలేదు. కేవలం అదృష్టం మీదే భారంవేసి చదువుతున్నాం.

మా జయరామ ప్రభువుగారు జాగ్రఫీపాఠం చెపుతూ "అరేయి! అబ్బాయిలూ! అందరూ వింటున్నారా. జాగ్రత్తగా వినండి. ఇప్పుడు మన మందరం విమానం ఎక్కాం. అదుగో అటు చూడండి" అంటుంటే ఇంతలోకి మా రాముడు లేచి "మాష్టారూ! ఒంటేలుకండీ!" అన్నాడు.

మాష్టారు "ఛ! వెధవ! కూర్చో. పాఠం చెప్తుంటే మంచి నీళ్లకు, ఒంటేలుకు అడగవద్దని ఎన్నిసార్లు చెప్పాను...ఆ...పాఠంలోకి రండి. మనం యిప్పుడు ఎక్కడున్నాం?" అంటే పాండుగాడు లేచి "విమానంలోనండి" అన్నాడు.

క్లాసంతా గొల్లు మన్నది.

మాష్టారు "వెధవల్లార! ఊరుకోండి. సరే. విమానం జోరుగా పోతున్నది. జాగ్రత్తగా కూర్చోండి. లేకపోతే పడిపోతారు. ఆఁ!–అదుగో కలకత్తా!!...అక్కడ పండే పంట జనుం!" అని చెప్పకుపొయ్యారు.

ఈ విధంగా జరిగేది క్లాసు. దసరా పరీక్షల్లో 'జనుము ఎచ్చట పండును' అనే ప్రశ్న వస్తే దానికి జవాబుగా, పాండు "అబ్బాయిలూ విమానం..." అని మాష్టారు చెప్పింది అక్షరాల పేపర్లో వ్రాసేశాడు, కాని తీరా జనుము ఎక్కడ అగుపడిందో జ్ఞాపకంరాక, వ్రాయలేక అలానే వదిలేశాడు. పర్యవసానం విమాన ప్రయాణం మాత్రమే దానికి జవాబుగా తేలిపోయింది.

పేపర్లిచ్చేటప్పుడు పాండును పిలచి, జయరాం ప్రభు "ఏమిట్రా! ఈ విమాన ప్రయాణం?" అంటే, పాండు లేచి "మీరు చెప్పిందే కదండీ" అన్నాడు. దాంతో మాష్టారు లేచివచ్చి పాండువీపు విమానంమోత మోగించ సాగారు. పాండు ఆ దెబ్బలకు ఎలాగో ఓర్చుకుంటూ "మాష్టారు! కొట్టకండీ నొప్పి పుట్టున్నదండీ: నొప్పి పుట్టకుండా కొట్టండీ" అనేశాడు. "అలాగేం? నొప్పిపుట్టకుండా కొట్టాలేం?" అంటూ జయరామ ప్రభుగారు మరీ గట్టిగా నాలుగు తగిలించారు. మావాడు నోరు ఆవులించేశాడు-ఆ దెబ్బలకి. ఆ రోజు సాయంత్రం మేమందరం కలిసి వాడిని ఓదార్చాం.

"అరేయి. గబ్బిలలాల స్కూల్లో డ్రామారా; వెళ్దాంరండి" అన్నాడు రాముడు.

'సరె అంటె సరె' అనుకొని అందరం డ్రామాచూచి వచ్చాం.

ఆ డ్రామా చూచివచ్చి నప్పటి నుంచీ మాకూ డ్రామా లేయాలని



# నాటక ప్రదర్శనం - సర్కసు వినోదము

పించింది. 'వేద్దాం అంటె వేద్దాం' అనుకున్నాం. మర్నాడు డ్రామా సామాగ్రి కోసమై బజార్లోకెళ్లి విచారిస్తే, పౌడరుడబ్బా రూపాయ ముప్పావలాట! అంతఖర్చు భరించలేమనుకొన్నాం. మరేమిటి మార్గం!...మావి యమ బుఱ్ఱలు లెండి! వెంటనే ఒక ఆలోచన తట్టింది. చాక్‌పీస్ పౌడరు!! చాలా బాగుందనుకొన్నాం. కానీ ఆచాక్‌పీసులు కొంటానికైనా మాదగ్గర ఎర్రని ఏగానీ కూడా లేదు! మా తల్లి తండ్రుల నడిగాం కాని, లాభం లేక పోయింది. కరువు అనేది వస్తే ఏదో ఒక్కదానికే వచ్చి వూరుకోదు - అన్నింటికీ కరువే!

"అరేయి; మా బామ్మపెట్టెలో నుంచి తీసుకు వస్తా; వుండండి" అంటూ రాధాయి త్వరగా వెళ్లి, బేడ తీసుకు వచ్చాడు. "దొరికిందే చాలు గదా" అనుకొన్నాం.

"ఎక్కడ వేద్దాంరా డ్రామా?" అన్నాను నేను.

"మన ప్రైవేటు మాష్టారింట్లో వేసేద్దాం లేరా!" అన్నాడు రాముడు. సరే. ఆయ నింట్లో డ్రామా అనీ, టిక్కెట్లు - అణా, అర్థణా, కానీ-అనీ, అందరు రావాలని గోడలమీద వ్రాశాం.

సాయంత్రమయేసరికి కొంత మంది పిల్లలు వచ్చారు. వచ్చిన వాళ్లందరూ టిక్కెట్లు కొంటారని ఆశపడ్డాం కానీ, అటువంటిదేమీ జరుగలేదు! ఊరికే అయితే వద్దామనుకొన్నారట వాళ్లందరూ!

ఇంతలోకే మా ప్రైవేటుమాష్టారొచ్చి "వెధవల్లార! చంపేస్తా! నాటకాలు గీటకాలు వేశారంటే." అన్నాడు. మా గుండెల్లో బండ రాళ్లు పడ్డాయి!!

చేసే దేమీ లేక "ఏమిట్రా" అని పాండు నడిగాను.

పాండు, మేము కలసి వాళ్ల యింటికి వెళ్ళి, వాళ్లమ్మతో ఆ రోజు నాటకం వేయకపోతే మా పరువు దక్కదని (అప్పట్లో మాకు మహా పరువు ఉన్నట్లు!) ఎలాగోలాగు మొరపెట్టుకొని ఎలాగయితేనేం చివరికి వాళ్లింటిమేడమీద డ్రామా వేయటానికి ఆవిడగారి అనుమతి పొందాం.

ఐదుగురు మాత్రం టిక్కెట్లు కొన్నారు. అవయినా, కాని టిక్కెట్లు! మా ఖర్చులు [బేడ] కూడా మాకు రాలేదు. అంత మాత్రంచేత మేము అధైర్య పడ లేదు. కాసేపు ఆగాం- ఎవరయినా టిక్కెట్లు కొంటారేమోనని. ఎవరు కొనలేదు. మా ప్రజ్ఞ చూపించుకోవాలిగా మరి? అందుకని తక్కిన వారిని ఊరికనే రానిచ్చేశాం. ఎలాగయితేనేం మానాటకం చూడటానికి కొంతమంది పోగయారు. అప్పుడే మేమేదో గాలిలో విహారిస్తున్నట్లు తారాపథాన్ని అందుకొన్నట్లు 'ఫీల్' అయినాం.

ఇంతలో రాధాయి ఏడుస్తూ వచ్చాడు. 'ఏమిట్రా సంగతం'టే వాళ్ల బామ్మ బేడ కొట్టేసినందుకు వాణ్ణి పట్టుకొని కొట్టిందిట!

"అరేయి: డ్రామాకోసం ఆ మాత్రం త్యాగం చేయకపోతే ఎలాగురా?" అని వాడిని సముదాయించి డ్రామాకు సిద్ధం చేశాం.

ఇంతవరకు మాకు నాటకం వేద్దామనే ఉబలాటం తప్ప ఏ నాటకం వేద్దామా అనే ఆలోచనే రాలేదు, చాలా పొరపాటు చేసామని అప్పుడు అనుకొన్నాం. ఏమి వేషాలు వేయాలో తోచలేదు. ఏమి చేయాలో అంతకంటే తోచలేదు. బయట తెరఎత్తమని అంటున్నారు ప్రేక్షక మహాశయులు!

చివరకు ఒకడికి రాముడి వేషం, మరొకడికి కృష్ణుడు వేషం వేశాం. రాముడూ, కృష్ణుడు ఎన్నడూ, ఎక్కడా ఏవిధంగానూ ఏపరిస్థితుల లోనూ కలుసుకోలేదని అప్పుడు గ్రహించలేక పోయాం. అనేకమంది సలహాల వలన మానాటకం ఈ క్రింది రీతిగా జరిగింది.

కృష్ణుడు: [ప్రవేశించి] రామా! ఒకసారి ఇటు రమ్ము.

రాముడు: [(ప్రవేశించి) కృష్ణా! నన్నెందులకు పిలిచినావు?

కృ: నీయిష్టము వచ్చిన పద్యమొకటి అప్పచెప్పుము.

రా: అలాగా! సరే. వినుము.

['శ్రీరాముని దయ చేతను' పద్యం అప్పచెప్పతాడు]

కృష్ణ: పాట బాగున్నది. మన మిద్దరము కాసేపు యుద్ధము చేద్దామా?

రాము: సరే కాచుకొనుము.

(కృష్ణుడు రాముని ఒక గుద్దు గుద్దుతాడు)

రాము: అరేయి! నెమ్మదిగా కొట్టరా బాబూ! దెబ్బ తగులుతున్నది.


కృష్ణ: దెబ్బ తగిలే టట్లయితే యుద్ధం వద్దులేరా. మనమూ అలసిపోయినట్లున్నాము. తెరలోకి పోదామా?

రాము: సరే. రారా పోదాం.

ఇదీ మా నాటకం. ఈలోగా కొంతమందిని వూరికే రానిచ్చామని, డబ్బులిచ్చి టిక్కెట్టు కొన్నవాళ్లకు ఎలాగో తెలిసిపోయింది. వాళ్ల డబ్బులు వాళ్లకిమ్మన్నారు. మా డ్రామా బాగుల్లే దన్నారు. [మీరు చెప్పండి - మా డ్రామా అంత మంచి డ్రామ కూకౌన్న డయినా చూచారా!] డబ్బులివ్వక పోతే తంతా మన్నారు. తప్పింది కాదు—మాకు వచ్చిన 'కలెక్షను' అణా కానీ, ఎవరిది వారి కిచ్చాం. అంతటితో మా నాటకం ముగిసింది.

ఈలోగా మా ఊరికి సర్కస్ వచ్చింది. దాన్ని చూచినది మొదలు మాకూ సర్కస్ ఆడాలనిపించింది. ఇదివరకు డ్రామా మాస్తరు కాక ఇప్పుడు కొంత ప్రాక్టీసు చేయటం మంచిదను కొన్నాం. సర్కస్‌కి గుఱ్ఱాలు కావాలి. మాదృష్టి ప్రసరించింది మొదటిగా వాటి మీదనే. కాని మాకు గుఱ్ఱాలు ఎలా దొరకుతాయి? దొరికినా అవి ఎత్తుగా వుంటాయి. అందుకని గుఱ్ఱాలను పోలిన జంతువుల కోసం అన్వేషించాం. సాయంత్రం వూట కచేరిలో గాడిదలువిహారిస్తుంటాయి.


## బోనోమింట్
## చ్యూయింగ్ గమ్-విరేచనకారి




బోనోమింట్ అజీర్ణాన్ని అతిత్వరలో హరింప చేస్తుంది! అజీర్ణం వల్ల కలిగే తల నొప్పి నిరుత్సాహత, నిస్సత్తువ మొదలైన బాధలకు ఎల్లప్పుడు వాడవచ్చును. బోనోమింట్ చ్యూయింగ్‌గమ్మే కావాలని అడగండి!

2, 6, 16, బిళ్లలుగల పేకట్లలో దొరకును.

ఏజెంట్లు:
ఓరియంటల్ మెర్కంటైల్ ఏజన్సీ, 99-A, ఆర్మీనియన్ వీధి, మద్రాసు—1.

## నాటక ప్రదర్శనం - సర్కసు వినోదము

ఒకరోజు సాయంత్రం వెళ్ళి చాం, ఐదుగురు హేమా హేమీ వాటిని పట్టుకోటానికి ప్రయత్నిం లయూ! అవి అంత తేలికగా పట్టుబడలేదు. వాటిని పట్టుకోటానికి అందరం కనీసం ఒక్కొక్క సారయినా బోర్లపడి ఉంటాం.

చివరకు ఒకదాన్ని పట్టుకొని,



దానిమూతికి తాడు కట్టి రంగాయి కెక్కించాం. రంగాయి స్వతహాగా కాస్త స్థూలకాయుడు. అందుకని గాడిదనడుము ఆబరువుకి కొద్దిగా వంగింది. మా కందరకీ నవ్వు వచ్చింది. మానవ్వుచూసి రంగాయి వుడుక్కొని నన్నొక దెబ్బవేశాడు. నేను "అబ్బ అబ్బ! మమ్మల్ని కాస్త కనిపెట్టి ఉండరా వెధవా" అన్నాను.

ఇంతలోకి గాడిద వెనక కాళ్ళతో రాధాయిని తన్నటం, రంగాయిని క్రిందపడేయటం, తాడు వదిలించేసుకొని పరుగెత్తటం జరిగింది. మేము మాత్రం ఊరుకొంటామా? భగీరథ ప్రయత్నంచేసి గాడిదను పట్టుకొని మా దొడ్లో కట్టేశాం.

గాడిద మాయింట్లో ఉన్నదని ఎలా తెలిసిందో ఏమో ఒక చాకలి వాడు మాయింటిమీదకి వచ్చాడు. 'చచ్చానురా' అనుకొన్నాను. గాడిదను ఇవ్వక తప్పింది కాదు. "పనేమో తను చేయించుకోవటం; మేతేకేమో దేశంమీద వదిలెయ్యటం" అని మనస్సులో అనుకొన్నాను.

మాబామ్మ వచ్చి "గాడిదల్ని కొంపలోకి ఎందుకు తీసుకు వచ్చావురా, గాడిదా! ఈదఫా తీసుకు వస్తే చంపేస్తా" అన్నది.

గాడిద పోతేపోయింది; ఈసారి కుక్కలమీదకు పోయింది మా దృష్టి. ఒక కుక్కపిల్లను (మామాట వింటుందని) తీసుకొచ్చి ఎవరికీ తెలియకుండా ఒక బల్లకింద కట్టేశాను.

రాత్రి అందరమూ భోంచేస్తుండగా-దాని దుంపతెగ - ఆకుక్కపిల్లకు ఏం వచ్చిందో ఏమో కానీ - అరవటం సాగించింది. "అయ్యో! దైవమా! దానికి తెలియదు కాబోలు, అది అరుస్తే నావీపు విమానం మోత మోగుతుందని" అని మనస్సులో మధన పడుతున్నాను.

అనుకొన్నట్లే ఆ అరుపు మా బామ్మ చెవిలో పడింది. తోక తొక్కిన త్రాచులా లేచిన మా బామ్మ "కుక్కల్నీ, పందుల్నీ కొంపలో పెట్టావురా పుండాకోర్" అంటూ నావీపు శుద్ధిచేసింది. దాంతో కుక్కలకీ స్వస్తిచెప్పాం!

ఈవిధంగా మా సర్కస్‌కు ఆదిలోనే ఎన్నో ఆటంకాలు వచ్చాయి. "ఎన్ని విఘ్నాలు వచ్చినా మనం వెనకాడ కూడదు" అని అందరం తీర్మానించు కున్నాం.

ఇవన్నీ అయిపోయాయి. ఇక ఉయ్యాల ఫీట్లమీద పడ్డాం. హైస్కూలులో తడికలకు కట్టిన తీగలుతీసుకొచ్చాం, రాముడూ నేను కలిసి. అవి మెలేసి రెండు ఉయ్యాలలు తయారుచేశాం. మాయింట్లో కోప్పడుతారని, రామువాళ్ళింట్లో ఉయ్యాలలు కట్టాం. కాస్త ప్రాక్టీసు చేశాం. ఈమూలనుంచి ఆమూలకు ఊగటం చేతనైంది. ఇంతలోకి రాధాయి ఉయ్యాలమీద నుంచి తృటికాలంలో నేలమీదకు చేరేశాడు. ఉయ్యాల తెగింది. మాకు భయం వేసింది. దేవుని దయవలన వాడికి దెబ్బలు తగలలేదు. ఇంతటితో ఉయ్యాలకు కూడ స్వస్తి చెప్పాం.

తరువాత పల్టీలు, పిల్లి మొగ్గలు ప్రయత్నించాం. నాకొక ఫీటు అప్పచెప్పారు. అదేమిటంటే— దూలం మీద నుంచి తలక్రిందులుగా వ్రేలాడటం. ఈ విషయంలో నాకు విజయంలభించింది. అందరూ నాఫీటును మెచ్చుకొన్నారు. ఈ దెబ్బతో నాకు స్నేహితుల్లో మంచి గౌరవం లభించుతుందను కొన్నాను.

సర్కస్ పెట్టాం. టిక్కెట్టు కాసీ అయితే లాభం రాదని, అర్ధణా పెట్టాం. ఈసారి ఎవ్వరినీ ఊరికే రానీయలేదు. కలెక్షను బేడ అర్ధణా వచ్చింది! ఆమాత్రానికే అందురూ సంతోషించాం. ఎందుకంటే-దీనికి మా పెట్టుబడి ఏమీలేదు.

సర్కస్ మొదలు పెట్టాం. మొదటి ఫీటు నాదే. దూలం పట్టుకొని తలక్రిందుగా వ్రేలాడను. అందరు చప్పట్లు కొట్టారు. "ఉషార్" అన్నారు. 'అబ్బ'-ఎమిటిదీ-? కాలుజారింది. క్రిందపడ్డాను. అంతే. అందరు పారిపోయారు. ఆఖరకు మా సర్కస్ కంపెనీవాళ్లు కూడా పారిపోయారు. ఏమిటి దారి? పెద్దగా ఏడ్పు వచ్చేసింది. ఏడ్చేశాను.

రోడ్డు మీద పోయే ఆయన ఎవరో వచ్చి నన్ను లేవతీశాడు. నడుం సరిచేశాడు. సోడా యిప్పించాడు. "మరెన్నడూ యిటువంటి పనులు చేయకు" అనిచెప్పి, ఆయన దారిన ఆయన పోయాడు. నేను నెమ్మదిగా లేచి కుంటుకొంటూ యింటికి వెళ్లాను. నావాలకం చూసి యింటిల్లపాదీ దేహశుద్ధి చేశారు.

★